సాక్షి నల్లగొండ

శుక్రవారం । 17 । నవంబర్ । 2023



పెయిడ్ పబ్లిసిటీ !
ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వివిధ పార్టీల అభ్యర్థులు జనానికి డబ్బులు పంచుతూ ప్రచారం సాగిస్తున్నారు. - 10లో



అప్పుల పాలు చేసిన కేసీఆర్
కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పుల పాలైందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. - 10లో



ఎక్సైజ్ దాడులు
సూర్యాపేట, నల్లగొండ ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బెల్ట్ షాపులపై దాడులు చేస్తున్నారు. - 10లో

న్యూస్‌రీల్

20న పవర్ లిఫ్టింగ్ జట్లకు క్రీడాకారుల ఎంపిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో ఈనెల 20న అండర్–19 విభాగం పవర్ లిఫ్టింగ్ జిల్లా జట్లకు బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ (అండర్–19) కార్యదర్శి కె.ఇందిర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 10వ తరగతి మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్లతో 20వ తేదీ ఉదయం 10 గంటలకు స్టేడియం వద్దకు రావాలని కోరారు. పూర్తి వివరాలకు కె.నర్సిరెడ్డి సెల్ : 9440072854 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రయాణికుల భద్రత.. డ్రైవర్ల బాధ్యత



ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఆర్‌ఎం, ఆర్‌టీఓ

నల్లగొండ రూరల్: ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికుల భద్రతను డ్రైవర్లు బాధ్యతగా తీసుకొని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి సురేష్‌రెడ్డి, ఆర్‌ఎం శ్రీదేవి అన్నారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు గురువారం నల్లగొండలోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేసి మాట్లాడారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం అందరికీ ప్రమాకరమన్నారు. ఉమ్మడి నల్లగొండ రీజియన్‌ను ప్రమాద రహితంగా మార్చేందుకు సిబ్బంది కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎం రాంమోహన్‌రెడ్డి, ఎల్‌ఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు భంగం కలిగిస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నేరేడుచర్ల : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సమైక్యతకు భంగం కలిగిస్తోందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆరోపించారు. గురువారం నేరేడుచర్లలోని సీపీఎం కార్యాలయం ఆరిబండి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంట్రిబ్యూషన్ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులకు, ప్రభుత్వాలకు ప్రయోజనం లేదని, ఆ నిధులు కార్పొరేట్ రంగాలకు పెట్టుబడులుగా మాత్రమే ఉపయోగపడుతున్నాయన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని విచారం వ్యక్తం చేశారు. 10లక్షల ఎకరాల భూ పంపిణీ చేసిన ఘనత కూడా కమ్యూనిస్టులదేనన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తిరిగి భూ కేంద్రీకరణ జరిగే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పెన్షనర్ల సంఘం కార్యదర్శి గుండా భిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ తిరుపతయ్య, మర్రి నాగేశ్వర్‌రావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



జోడు సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవార్లను మేల్కొపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూలకు నిజాభిషేకం జరిపించి, తులసీ దళాలతో అర్చించారు. ఇక ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.



సభ ఏర్పాట్లపై బీజేపీ నాయకులతో చర్చిస్తున్న ఎస్పీ అపూర్వరావు, ఎస్‌ఎస్‌జీ సిబ్బంది

మేకల అభినవ్ స్టేడియంలో అమిత్‌షా సభ

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈనెల 18న జరగనున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బహిరంగ సభకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను గురువారం జాతీయ రక్షక దళం (ఎస్‌ఎస్‌జీ) సిబ్బంది, జిల్లా ఎస్పీ అపూర్వరావు, బీజేపీ నాయకులు పరిశీలించారు. భద్రత చర్యల్లో భాగంగా ముందస్తుగా పరిశీలన చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి వెంట బీజేపీ నేతలు గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల నరసింహారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ప్రచార హోరు.. అధినేతల జోరు

- సీఎం ప్రజా ఆశీర్వాద సభలు ముమ్మరం
- మరో మూడు నియోజకవర్గాల్లో నిర్వహణకు బీఆర్‌ఎస్ సన్నాహాలు
- రోడ్‌షోలలో పాల్గొననున్న కేటీఆర్
- త్వరలో రంగంలోకి దిగనున్న కాంగ్రెస్ అగ్రనాయకత్వం
- బీజేపీ అభ్యర్థుల ప్రచారానికి కేంద్ర మంత్రులు
- నల్లగొండలో పాల్గొననున్న అమిత్‌షా

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు గడువు దగ్గర పడుతుండడంతో అన్ని రాజకీయ పార్టీలు ప్రచారాన్ని పరిగెత్తిస్తున్నాయి. ఎన్నికల్లో ప్రధాన ఘట్టానికి రెండు వారాలే మిగిలి ఉండడంతో ఇప్పటికే ప్రచారం కొనసాగిస్తున్న అన్ని పార్టీలు మరింత జోరు పెంచనున్నాయి. ముఖ్య నాయకుల రాకతో ప్రచారం తారస్థాయికి చేరనుంది.

- సాక్షి ప్రతినిధి, నల్లగొండ





ప్రచారంలో కొంత ముందున్న బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించింది. మరో రెండు నియోజకవర్గాల్లో సభల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సభల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పాల్గొంటున్నారు. సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, ఆలేరు, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్, భువనగిరి, మునుగోడు ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం పాల్గొన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు సంక్షేమ పథకాల అమలు, అవి ప్రజలకు అందుతున్న తీరు, ధరణి ప్రయోజనాలు, 24 గంటల విద్యుత్‌పై ప్రజలకు వివరిస్తున్నారు. ఈ నెల 20న నకిరేకల్, నల్లగొండలో నిర్వహించే సభల్లో, 21వ తేదీన రెండోసారి సూర్యాపేటలో నిర్వహించే సభలో కేసీఆర్ పాల్గొంటారు. ఇటీవల నకిరేకల్ నియోజకవర్గం చిట్యాలపట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామరావు 20వ తేదీన ఆలేరు, మిర్యాలగూడలో, 22వ తేదీన కోదాడ పట్టణంలో రోడ్ షోలలో పాల్గొననున్నారు.

రేపు అమిత్‌షా పర్యటన

బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు బీజేపీ జాతీయ నేతలు రంగంలోకి దిగారు. ఇప్పటికే కేంద్ర మంత్రులు శోభ కరంద్లాజే, అనురాగ్ ఠాకూర్, రాజీవ్ చంద్రశేఖర్‌లు ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. ఈ నెల 18న మధ్యాహ్నం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా నల్లగొండలో నిర్వహించే సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఇతర కేంద్ర మంత్రులను కూడా రంగంలోకి దింపేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది.

గడపగడపకూ..

ముఖ్యనాయకుల సభలతోనే కాకుండా.. మిగతా రోజుల్లో అభ్యర్థులు వారి నియోజకవర్గాల్లో ప్రతి గ్రామంలో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో సభలు, సమావేశాలతో పాటు కుల సంఘాలు, యువతతో ప్రత్యేక సమావేశాలు, సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. గడపగడపకూ తిరుగుతూ, అన్నా ఎట్లున్నవు... చెల్లె, అక్కా బాగున్నవా.. అమ్మా ఓటెయ్యాలే.. అంటూ ప్రచారం చేస్తున్నారు.

రాహుల్, ప్రియాంక సభలకు కసరత్తు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రచారానికి జాతీయ స్థాయి నేతలు రంగంలోకి దిగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే నియోజకవర్గాల్లో అభ్యర్థులు ప్రచారంలో వేగం పెంచగా, కోదాడ, హుజూర్‌నగర్‌లో కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ మంత్రి రఘువీరారెడ్డి రోడ్ షోలలో పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ 17వ తేదీన ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఆ తరువాత రోజుల్లో నల్లగొండ జిల్లాలోనూ ఆయన పర్యటించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయనతోపాటు ప్రియాంకగాంధీ సభలను కూడా కాంగ్రెస్ నాయకులు ప్లాన్ చేస్తున్నారు.

ఆకాశంలో సగం.. పోటీలో నామమాత్రం!

- చట్ట సభలకు మహిళల ప్రాతినిధ్యం తక్కువే
- ఈ ఎన్నికల్లో 12 నియోజకవర్గాల నుంచి 24 మంది మాత్రమే పోటీ
- ప్రధాన పార్టీల నుంచి ఆరుగురికే చాన్స్

ఆకాశంలో సగం అవనిలో సగం అంటూ మహిళలను తమ ప్రసంగాల్లో పొగుడుతున్న నాయకులు ఎన్నికల్లో మాత్రం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నా నామమాత్రంగానే టికెట్లు దక్కుతున్నాయి. కేంద్రం ఇటీవల ఆమోదించిన మహిళా బిల్లు ప్రకారం 2028 ఎన్నికల్లో 33 శాతం మహిళలు పోటీకి దిగే అవకాశం ఉంది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 8.69శాతం మందికే చాన్స్ దక్కింది. వీరిలో ప్రధాన రాజకీయ పార్టీల నుంచి తక్కువ, ఇండిపెండెంట్లు, అన్ రికగ్నైజ్డ్‌పార్టీల వారు ఎక్కువమంది బరిలో ఉన్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఈ సారి ప్రాతినిధ్యం పెరిగింది.

- సాక్షి, యాదాద్రి



మహిళలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా చూస్తున్నాయి తప్పా తగిన ప్రాధాన్యం ఇవ్వడంలేదు. జనాభాలో సగం ఉన్నా అరకొర టికెట్లు కేటాయిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 29,00,254 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 14,35,247 మంది, మహిళలు 14,64,807 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే 29,560 మంది అధికంగా ఉన్నారు. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలతో పాటు రిజిస్టర్డ్ పార్టీలు, ఇండిపెండెంట్లు కలిపి మొత్తం 276 మంది పోటీలో ఉన్నారు. ఓటర్లలోనూ మహిళలు అధికంగానే ఉన్నా ఈసారి 24 మంది మహిళలకు మాత్రమే పోటీ చేసే అవకాశం దక్కింది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి ఒక్కరి చొప్పున, బీజేపీ నుంచి ఇద్దరు, బీఎస్పీ నుంచి ఒక్కరు, సీపీఎం నుంచి ఒక్కరు పోటీపడుతున్నారు.

నాలుగు చోట్ల ప్రాతినిధ్యమే లేదు

ఈ సారి ఎన్నికల్లో ఎనిమిది నియోజకవర్గాల నుంచి మహిళలకు బరిలో నిలిచే అవకాశం దక్కింది. భువనగిరి, మిర్యాలగూడ, మునుగోడు, దేవరకొండ నుంచి ప్రాతినిధ్యం లేదు.

బరిలో నిలిచిన మహిళల సంఖ్య

నియోజకవర్గం	2023	2018	2014
ఆలేరు	4	2	3
భువనగిరి	-	-	1
దేవరకొండ	-	-	1
హుజూర్‌నగర్	6	1	1
కోదాడ	4	1	1
మిర్యాలగూడ	-	1	-
మునుగోడు	--	1	
నాగార్జునసాగర్	4	2	1
నకిరేకల్	2	2	3
నల్లగొండ	1	1	-
సూర్యాపేట	1	2	-
తుంగతుర్తి	2	4	1
మొత్తం	24	16	13

మూడు ఎన్నికల్లోనూ..

2014, 2018 ఎన్నికలతో పోలిస్తే ఈ సారి మహిళల ప్రాతి నిధ్యం కాస్త పెరిగింది. 2014లో మొత్తం 161 మంది పోటీలో ఉంటే వీరిలో 14 మంది మహిళలు ఉన్నారు. 2018లో 202 మంది బరిలో నిలిస్తే 16మంది మహిళలకు చాన్స్ దక్కింది. 2023లో 276 మంది పోటీ చేస్తుండగా వీరిలో 24 మంది మహిళలు బరిలో ఉన్నారు.

ప్రస్తుత ఎన్నికల్లో పోటీలో ఉన్న మహిళలు వీరే..

- ఆలేరు: గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి(బీఆర్‌ఎస్), గడ్డమీది శ్రావణి (అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ), పాలడుగు ఉపేంద్ర (స్వతంత్ర), గున్న శ్రీదేవి(స్వతంత్ర)
- నాగార్జునసాగర్: నివేదితా రెడ్డి (బీజేపీ), అనిత మసున (అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ), అన్నపూర్ణ నకిరేకంటి (యుగ తులసి పార్టీ), బి.రుక్మిణి నాయక్ (జై మహా భారత్ పార్టీ)
- సూర్యాపేట: కొత్తపల్లి రేణుక (ఇండిపెండెంట్)
- తుంగతుర్తి: కోతి ఇందిర (తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ), రెడ్డిమల్ల సుజాత (ఇండిపెండెంట్)
- నల్లగొండ : తవిటి సంతోష (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ)
- నకిరేకల్ : మేడి ప్రియదర్శిని (బీఎస్పీ), కొమ్ము శోభారాణి (ఇండి పెండెంట్)
- కోదాడ: పద్మావతి రెడ్డి(కాంగ్రెస్), మానుకుంట భవాని(ఇండిపెండెంట్), బాదె శ్రీవిద్య(ఇండిపెండెంట్), మంద గౌతమి(ఇండిపెండెంట్)
- హుజూర్‌నగర్: చల్లా శ్రీలత(బీజేపీ), మల్లు లక్ష్మి(సీపీఎం), అవిరెండ్ల జ్యోతి(ధర్మ సమాజ్ పార్టీ), పిల్లలమర్రి లావణ్య(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), చీకూరి లీలావతి(ఇండిపెండెంట్), వస్కుల సైదమ్మ(ఎంసీపీఐ యూ)

ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి



సదస్సుకు హాజరైన విద్యార్థినులు

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ: ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధమని, ప్రతి ఓటరు ఈనెల 30న ఓటుహక్కును విధిగా వినియోగించుకోవాలని జెడ్పీ సీఈఓ, స్వీప్ జిల్లా నోడల్ అధికారి ఎస్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్షేత్ర ప్రచార అధికారి జి.కోటేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఓటుహక్కు చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాలు లేని స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం యువత కృషిచేయాలన్నారు. అనంతరం డీఆర్‌డీఓ కాళిందిని మాట్లాడుతూ యువత నిజాయితీగా ఓటు వేయడంతోపాటు తమ కుటుంబాల్లోని అర్హులైన వారంతా ఓటు వేసేలా అవగాహన పర్చాలన్నారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఓటు హక్కు వినియోగించుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, మినా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మహమూద్‌అలీ, స్వీప్ జిల్లా సమన్వయ కర్త అరుణ్‌కుమార్, డీపీఓ ప్రతాప్‌నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ వాణి పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి

నల్లగొండ టూటౌన్: క్రీడా పోటీల్లో విద్యార్థులు తమ సత్తా చాటాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.భిక్షపతి అన్నారు. గురువారం నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్– 14, 17, 19 బాలబాలికల తైక్వాండో, టేబుల్ టెన్నిస్, సెపతక్రా, క్రికెట్, కరాటే పోటీలను డీఈఓ ప్రారంభించి మా ట్లాడారు. ప్రతి విద్యార్థి తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. ఆత్మ రక్షణ కోసం బాలికలు తప్పనిసరిగా కరాటే నేర్చుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి జట్లకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు జి.వాసుదేవరావు, కె.ఇందిర, మాజీ కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి, వ్యాయామ పీఈటీలు విజయ్‌పాల్, వేదవతి, నాగరాజు, గఫార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ

నేడు బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్టుల ప్రదర్శన

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో శుక్రవారం జిల్లాస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని స్కూళ్లలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. ఇద్దరు చొప్పున జూనియర్స్, సీనియర్స్ విభాగాల నుంచి 5 ఉప అంశాల్లో ప్రాజెక్టు తయారు చేయవచ్చని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు 18 అంశాలతో కూడిన రిపోర్టు, లాక్‌బుక్, 4 చార్టులు తీసుకురావాలని కోరారు.

20న సామూహిక దీపోత్సవం

యాదగిరిగుట్ట : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని యాదాద్రి రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో ఈ నెల 20వ తేదీన సామూహిక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ గీతారెడ్డి గురువారం తెలిపారు. సాయంత్రం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో దీపోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

మైక్రో అబ్జర్వర్లుగా 417 మందిని నియమించాం

- జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్

నల్లగొండ: ఎన్నికల విధులకు జిల్లాలో పనిచేస్తున్న 417 మంది ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్లుగా నియమించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వర్తించే మైక్రో అబ్జర్వర్లను ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు సమక్షంలో మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తయిందన్నారు. ఉద్యోగం, నివాసం, ఓటు హక్కు కలిగిన నియోజకవర్గాల్లో కాకుండా ఇతర నియోజకవర్గాల్లో మైక్రోఅబ్జర్వర్లుగా నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం, ఆర్.కన్నన్, అవినాష్ చంపావత్, నకిరేకల్ ఆర్‌ఓ హేమంత్ కేశవ్ పాటిల్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి భిక్షపతి, అసిస్టెంట్ నోడల్ అధికారి గణపతిరావు, శిక్షణ నోడల్ అధికారి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ : మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న సతీష్ గురుమూర్తి

రోజు వారీ ఖర్చులు నమోదు చేయాలి

దేవరకొండ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విధిగా రోజు వారీ ఖర్చులు నమోదు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు సతీష్ గురుమూర్తి అన్నారు. గురువారం దేవరకొండ ఆర్‌ఓ కార్యాలయంలో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నామినేషన్ దాఖలు తేదీ నుంచి ఎన్నికల ప్రచార కార్యక్రమాలు ముగిసే వరకు అభ్యర్థులు ఎన్నికల ఖర్చులు ఎలా నమోదు చేయాలో వివరించారు. ప్రతిఒక్క ఖర్చుకు సంబంధించి బిల్లులు తీసుకోవాలని సూచించారు. ఈనెల 19, 23, 28వ తేదీల్లో ఖర్చుల నమోదు వివరాలు పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు తమ రోజు వారీ ఖర్చుల రిజిస్టర్‌తో ఆయా తేదీల్లో విధిగా ఆర్డీఓ కార్యాయాల్లో హాజరుకావాలని కోరారు.

ఐటీ దాడులు జరగలేదు..

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడలో జరిగిన ఐటీ దాడులపై స్థానిక బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు స్పందించారు. వ్యాపారులు, రైస్ మిల్లుల్లో ఐటీ అధికారులు సోదాలు చేస్తే.. తన ఇళ్లపై జరిగాయంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు దేశం మొత్తం వ్యాపారాలు ఉన్నాయని ప్రచారం చేయడం తగదని అన్నారు. ప్రతిపక్ష నాయకులు, కొంతమంది తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని భాస్కర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు

నార్కట్‌పల్లి, నల్లగొండ రూరల్: రైతుల నుంచి ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నార్కట్‌పల్లి, ఎల్లారెడ్డిగూడెం, నల్లగొండ మండలం రసూల్‌పురం, ముషంపల్లి, జీకే అన్నారం, వెలుగుపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 28,262 మంది రైతుల నుంచి 2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.186కోట్లు ఖాతాల్లో జమ చేశామన్నారు. కార్యక్రమాల్లో సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐ డి.లింగస్వామి, కేంద్రాల నిర్వాహకులు తదితరులు ఉన్నారు.



నల్లగొండ రూరల్ : రసూల్‌పురంలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

ఎన్నికల చిత్రాలు

● గరం.. గరం.. ప్రచారం



కోదాడ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్నింగ్ వాకర్స్‌కు చాయ్ అందిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి

● నాన్నకు ఓటు.. అభివృద్ధికి తోడ్పాటు



సూర్యాపేట పట్టణంలోని 8వ వార్డులో మంత్రి జగదీష్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న ఆయన తనయుడు వేమన్‌రెడ్డి

● సాగు కష్టాలు తీరుస్తా..



తిరుమలగిరి(సాగర్) మండలం నాయకునితండాలో నాగలితో పొలం దున్నుతున్న నాగార్జునసాగర్ బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్

● మీలో ఒకరినవుతా..



గరిడేపల్లి మండల పరిధిలో ప్రచారంలో భాగంగా గడ్డిమోపు ఎత్తుకున్న సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన కేసీఆర్

● టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

కోదాడ: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిస్తూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. గురువారం కోదాడ పట్టణంలో నిర్వహించిన మలి విడత తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సాధన లక్ష్యాలైన నీళ్లు, నిధులు, నియామకాలను వదిలేసి సీఎం కేసీఆర్ కమీషన్ల కోసం పనికిరాని ప్రాజెక్టులను తెరమీదకు తెచ్చాడని విమర్శించారు. 60ఏళ్ల క్రితం కట్టిన ప్రాజెక్టులు చెక్కుచెదరకుండా ఉంటే రూ.లక్ష కోట్లు అప్పులు తెచ్చి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే మునిగిపోతుందన్నారు. పేపర్ లీకేజీలతో రాష్ట్రంలోని నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో ఆదరించాలని పిలుపునిచ్చారు. పందిరి నాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి, ధర్మార్జున్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి

నకిరేకల్: సీఎం కేసీఆర్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని కోదండరాం పిలుపునిచ్చారు. గురువారం నకిరేకల్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధనకు కాంగ్రెస్ పార్టీకి తమ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి, రిటైర్డ్ అధ్యాపకుడు గోనారెడ్డి, టీజేఎస్ జిల్లా నాయకులు ధర్మార్జున్‌రెడ్డి, బీసీపీ జిల్లా కార్యదర్శి గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌పై కేసీఆర్ చెప్పేవి పచ్చి అబద్ధాలు

● ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్: విద్యుత్‌పై సీఎం కేసీఆర్ పచ్చి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉచిత విద్యుత్ ఇచ్చింది వైఎస్ రాజశేఖరరెడ్డి అని ప్రజలకు తెలుసన్నారు. గురువారం నల్లగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, 24 నిమిషాలు కూడా కరెంట్ పోకుండా విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు. తెలంగాణ ప్రజల బాగుపడాలని సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే కేసీఆర్ మాత్రం అక్రమంగా దోచుకున్నాడని ఆరోపించారు. నిరుద్యోగులను నిండా ముంచాడని విమర్శించారు. కూతురు కవిత ఓడిపోతే వెంటనే ఎమ్మెల్సీ పదవి ఇచ్చాడు కానీ, నిరుద్యోగులను, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. నల్లగొండ జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం వద్ద కుర్చీ వేసుకుని పూర్తి చేస్తాను అని చెప్పిన కేసీఆర్‌కు ఇంకా కుర్చీ దొరకడం లేదా? అని ప్రశ్నించారు.

కేసీఆర్ మాటలు అసత్యం

● మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

నిడమనూరు: కేసీఆర్ సీఎం హోదాలో ఉండి అసత్య ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి విమర్శించారు. నిడమనూరు మండల కేంద్రంలో గురువారం ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. 14వ తేదీన హాలియా సభలో సీఎం కేసీఆర్ చెప్పిన మాటలు నిరూపించాలని.. లేదంటే తన కుమారుడు, కాంగ్రెస్ పార్టీ సాగర్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి చేసిన సవాల్‌పై ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. విద్యుత్ ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తే దానికి సహకరిస్తాం, అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటా అన్నాను కానీ.. బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకుంటానని అనలేదని జానారెడ్డి స్పష్టం చేశారు. పదేపదే తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంపై తాను గతంలో ఎన్నోసార్లు ప్రశ్నించాను, ఉత్తరాలు రాశాను అయినా సీఎం సమాధానం ఇవ్వలేదన్నారు. అడిగిన దానికి సమాధానం చెప్పు లేదా తప్పుగా మాట్లాడనని హామీదాగా ఒప్పుకో అని హితవు పలికారు.

SUIT SUMMONS UNDER V RULE 20 OF CPC
IN THE COURT OF PRINCIPAL
JUNIOR CIVIL JUDGE AT MIRYALAGUDA
O.S. No : 229 of 2023

Between :
శ్రీమతి గొళ్ళ సుజాత & ఇతరులు ...వాది
And
1. The Manager, State Bank of India SIB Branch, Miryalaguda
2. ఎవరికి సంబంధించితే వారికి ..ప్రతివాదులు

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! (1) శ్రీమతి గొళ్ళ సుజాత, భర్త : కీ.శే॥ రమేష్, వయస్సు 63 సం॥లు, గృహిణి, (2) గొళ్ళ అనిల్ కుమార్, తండ్రి : కీ.శే॥ రమేష్, వయస్సు : 43 సం॥లు, ప్రైవేట్ ఉద్యోగి మరియు (3) గొళ్ళ వినయ్‌కుమార్, తండ్రి: కీ.శే॥ రమేష్, వయస్సు 40 సం॥లు, ప్రైవేట్ ఉద్యోగి, మిర్యాలగూడ వాస్తవ్యులు, ప్రస్తుత నివాసం: హైదరాబాద్ గారలు గొళ్ళ రమేష్ గారు చనిపోయినారని అతనికి తామే వారసులమని ధ్రువీకరించమని కోరుతూ పై కోర్టులో దావా వేసి ఉన్నారు. అట్టి దావా విషయమై ఎవరికైనా అభ్యంతరం ఉన్న యెడల తేదీ 01-12-2023న ఉదయం 10-00 గంటలకు పై కోర్టు ఎదుట హాజరు అయి మీ యొక్క అభ్యంతరములను తెలియజేయగలరు లేనియెడల కోర్టు వారు పై దావాను వాదులకు అనుకూలముగా తీర్మానించెదరు.
// కోర్టు వారి అనుమతితో //
సం/- ఏచూరి శ్రీనివాస్, న్యాయవాది
మిర్యాలగూడ. సబ్ జైల్ రోడ్, మిర్యాలగూడ
తేది.9.11.2023 మొబైల్ : 990 860 9090.

హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

భువనగిరి క్రైం: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.11 వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి గురువారం తీర్పు చెప్పారు. జనవరి 1 2019లో ఆలేరు మండలం గొలనుకొండ గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి దుస్తులు కొనేందుకు తన భార్యతో కలిసి మోటార్ సైకిల్‌పై జనగాం వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. గొలనుకొండ గ్రామ శివారులో గ్రామానికి చెందిన దానాబోయిన పరుషరాములు వెంకట్‌రెడ్డిని అడ్డగించి తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని అనుమానిస్తూ ఇనుప రాడ్డుతో తలపై కొట్టాడు. దీంతో వెంకట్ రెడ్డి కిందపడ్డాడు. అతని భార్య రక్షించే ప్రయత్నం చేయగా వెంట తెచ్చిన కత్తితో ఆమె ఎడమ చేతిపై దాడి చేసి గాయపరిచాడు. అనంతరం పరుశురాములు వెంకట్ రెడ్డిని కత్తితో పొడిచి హత్య చేశాడు. మృతుడి బావమరిది రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు ఆలేరు ఎస్ఐ రమేష్, యదగిరిగుట్ట సీఐ నర్సయ్య కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని జనవరి 8 2020న అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం అడిషనల్ జిల్లా సెషన్ కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితునికి జీవిత ఖైదుతో పాటు రూ.11 వేల జరిమానా విధిస్తూ జడ్జి మారుతి దేవి తీర్పు చెప్పారు.

పెయిడ్ పబ్లిసిటీ !

జంగ్ తెలంగాణ

● జనబలం చూపించుకోవడానికి నాయకుల ఆర్భాటం
● రోజువారి కూలీలకు పెరిగిన గిరాకీ
● వారికి డబ్బులతోపాటు భోజనం
● డప్పులు, డీజే, కోలాట కళాకారులకు సైతం మస్తు డిమాండ్



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రాధాన్యం ఇస్తూ.. జన బలం చూపించుకోవడానికి రాజకీయ పార్టీ నాయకులు నానా తంటాలు పడుతున్నారు. ప్రచారంలో ఆర్భాటం లేనిది ప్రజలు బయటికి రావడం లేదు. దీంతో నాయకులు జన సమీకరణకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండటంతో రోజువారి కూలీలకు డిమాండ్ ఏర్పడింది. నాయకులు ఖర్చుకు వెనుకాడకుండా కూలీలను కార్యకర్తలుగా చూపుతున్నారు. వారికి భోజనంతో పాటు మద్యం సైతం అందిస్తున్నారు. డప్పు, కోలాట, జనపద కళాకారులు, డీజేలు, మైకులు, ఆటోలకు సైతం గిరాకీ ఉంటోంది. దీంతో డప్పు కళాకారులు పల్లెల నుంచి పట్నం బాటపట్టారు. ఇక కోలాట కళాకారులైతే గ్రామానికి ఒక గ్రూప్ తయారైంది. ప్రతి కళాకారుడికి వసతి కల్పించి కొంత మొత్తం ఇస్తుండటంతో వారంతా తీరిక లేకుండా పని చేస్తున్నారు.

జన బలం ఉండేలా..

ఎన్నికల పుణ్యమాని వివిధ రాజకీయ పార్టీలు నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు చాలా మందికి ఆర్థికంగా ఉపయోగపడుతున్నాయి. అన్ని పార్టీలు గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ ప్రజల నుంచి ఓట్లు అభ్యర్థిస్తున్నాయి. ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో తమ వెంట ఎవ్వరూ లేరు అనేది రాకుండా చూసుకుంటున్నాయి. ఇందుకోసం నాయకులు రోజువారి కూలీలను కార్యకర్తలుగా చూపుతూ వారిని ప్రచారంలో భాగస్వాములను చేస్తున్నారు. వీరికి రోజుకు పురుషులకు రూ.400, మహిళలకు రూ.300 చొప్పున చెల్లిస్తున్నారు. భోజన సౌకర్యం, రవాణా ఖర్చులు అదనం. దీంతో గ్రామాల్లో కూలీలు కనిపించడం లేదు. పంటలు చేతికందే సీజన్ కావడంతో వ్యవసాయ పనులకు కూలీలు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నాయకులకు బాధ్యతలు..

ఎన్నికల ప్రచారానికి జన సమీకరణ బాధ్యతను ద్వితీయ శ్రేణి నాయకులకు అప్పగిస్తున్నారు. గ్రామాల్లో జనంతో ఎక్కువగా మమేకమైన వారిని, నమ్మకమైన వ్యక్తులను ఎంచుకుంటున్నారు. వారే దగ్గరుండి ప్రచారం ముగిసే వరకు అన్ని చూసుకుంటున్నారు. కార్యకర్తలు తక్కువగా ఉంటే వచ్చే ఇబ్బందులను గుర్తించి ద్వితీయ శ్రేణి నాయకులు ముందస్తుగానే పెయిడ్ కార్యకర్తలను సిద్ధం చేసుకుంటున్నారు.

సౌండ్ పెరిగితే కేసే..



భువనగిరి : ఎన్నికలు వచ్చాయంటే పార్టీలు ప్రచార రథాలపై మైకులతో మోతమోగిస్తుంటారు. ప్రత్యేకంగా అభ్యర్థులు రూపొందించుకున్న పాటలతో పాటు మీ ఓటు మాకే అంటూ మైకు ద్వారా ప్రచారం చేస్తుంటారు. కానీ, ఎన్నికల సంఘం ఏ మేరకు సౌండ్ వినియోగించాలో నిబంధన విధించింది. ఆస్పత్రులు, విద్యాలయాలు, న్యాయస్థానాల వద్ద సౌండ్ 40 డెసిబెల్స్ నుంచి 50, నివాస ప్రాంతాల్లో 45 నుంచి 50, వాణిజ్య ప్రాంతాల్లో 55 నుంచి 65, పారిశ్రామిక ప్రాంతాల్లో 70 డెసిబెల్స్ నుంచి 75 డెసిబెల్స్ వరకు సౌండ్ ఉండాలని నిబంధన ఉంది. ఈ నిబంధనలను ఉల్లఘిస్తే పర్యావరణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసే అవకాశం ఉంది.

ఈవీఎంలలో గుర్తుల కేటాయింపు ఇలా..



భువనగిరి: ఈవీఎంలలో అభ్యర్థులకు గుర్తులు ఎలా కేటాయిస్తారు అంటే.. ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులను ఈవీఎంలలో మొదట వరుస క్రమంలో కేటాయిస్తారు. రిజిస్టర్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులను ఆ తర్వాత వరుస క్రమంలో కేటాయిస్తారు. నామినేషన్ పత్రంలో నమోదు చేసిన పేర్ల తెలుగు అక్షర మాల ప్రకారం అభ్యర్థులు వరుసగా ఉంటారు. రిజిస్టర్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు మాత్రం నామినేషన్ పత్రంలో ప్రాధాన్యత క్రమంలో వారు కోరుకున్న గుర్తులను రిటర్నింగ్ అధికారి కేటాయిస్తారు. ఒకే గుర్తును ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఎంపిక చేసుకుంటే డ్రా తీస్తారు.

'బ్లాక్' విధులంటే..


తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా సీఈసీ ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ అవేర్‌నెస్ సెంటర్స్ (బ్లాక్)ను ఏర్పాటు చేసింది. ప్రతి బ్లాక్‌లో ప్రభుత్వ, సెమీ ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి, ఓటు హక్కు ఉన్న స్థానికులు, రాజకీయ పార్టీలతో సంబంధం లేని అధికారులను సభ్యులుగా నియమించారు. ప్రతి బ్లాక్‌కు నాయకుడిగా బీఎల్‌ఓ వ్యవరిస్తుండగా ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశ కార్యకర్త, విలేజ్ బుక్ కీపర్ సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరంతా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. బూత్‌స్థాయిలో విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీల ద్వారా, దివ్యాంగులు, వయో వృద్ధులకు ఇంటి వద్దే ఓటు హక్కుపై చైతన్యం కల్పిస్తున్నారు.

ఓటు వేస్తూ సెల్ఫీ.. నేరం



భువనగిరి: పోలింగ్ బూత్‌లో ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో ఫోన్‌తో సెల్ఫీలు దిగడం నిషేధమని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. సెల్ఫీ ఫొటోలను ఇతరులకు చూపించడాన్ని కూడా నిషేధమని ప్రకటించింది. ఒకవేళ అలా చేస్తే నిబంధన 46(ఎం) మేరకు ఎన్నికల అధికారులు వెంటనే ఆ ఓటరును పోలింగ్ బూత్ నుంచి బయటకు పంపిస్తారు. అతడి ఓటును నిబంధన 17(ఏ)లో నమోదు చేస్తారు. లెక్కింపు సమయంలో ఓ ఓటును పరిగణలోకి తీసుకోరు.

సిరా నిబంధనలు ఇవీ..



తిరుమలగిరి (తుంగతుర్తి) : ఓటు వేసే ముందు ఎడమ చేయి చూపుడు వేలుపై సిరా చుక్క వేస్తారు. ఓటరుకు ఎడమ చేయి చూపుడు వేలు లేకపోతే ఎలా అనే ప్రశ్న తలెత్తడం సహజమే. అయితే ఎడమ చేయి చూపుడు వేలు లేకపోతే మధ్య వేలుకు, అదీ లేకపోతే బొటన వేలుకు సిరా చుక్క అంటిస్తారు. ఎడమ చేయికి వేళ్లే లేకుంటే కుడిచేయి చూపుడు వేలుకు.. అది లేకపోతే మధ్య వేలుకు, అదీ లేకపోతే ఉంగరం వేలుకు సిరా చుక్క అంటిస్తారు. ఒకవేళ రెండు చేతులకు వేళ్లు లేకపోతే వేళ్ల మొదలు భాగానికి సిరా చుక్క వేస్తారు.

ఎక్సైజ్ దాడులు

● 235 లిక్కర్, 110 బీర్ బాటిళ్లు స్వాధీనం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎక్సైజ్, సూర్యాపేట జిల్లా టాస్క్‌ఫోర్స్, నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా మూడు రోజులుగా నియోజవర్గంలోని పలు బెల్ట్ షాపులపై దాడులు చేసి 235 లిక్కర్, 110 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సారా సరఫరా చేస్తున్న వారిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు. ఈమేరకు గురువారం హుజూర్‌నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ నాగార్జునరెడ్డి కేసుల వివరాలను వెల్లడించారు. మఠంపల్లి మండలం అవిరేణి కుంటతండాకు చెందిన బానోతు వేణు, దారవత్ సంతోష్‌లు సారా తరలిస్తుండగా పట్టుకుని 30 లీటర్ల సారాతో పాటు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హుజూర్‌నగర్ మండలంలోని అమరవరానికి చెందిన గురువారెడ్డి, వీర బాబులు సారా తరలిస్తుండగా 10 లీటర్ల సారాతో పాటు మోటార్ సైకిల్‌ను పట్టుకున్నామన్నారు. తండాలు, గ్రామాల్లో సారా విక్రయిస్తున్న 9 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి 235 లిక్కర్ బాటిళ్లు, 110 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లాలితండా, బిల్యానాయక్ తండా, కొత్తతండా శివార్లలో పొలాల్లో దాచి ఉంచిన 3,900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.



మద్యం బాటిళ్లు చూపుతున్న అధికారులు

రూ.3.43లక్షల నగదు, మద్యం సీజ్

నల్లగొండ: ఎన్నికల కోడ్ నేపథ్యంలో గురువారం నల్లగొండ జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో రూ.3.43లక్షల నగదుతో పాటు ఇతర విలువైన వస్తువులను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. రూ.3,32,300 నగదు, రూ.3,150 విలువైన వస్తువులు, రూ.8,552 విలువ చేసే లిక్కర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

నా మిత్రుడి విజయాన్ని చూద్దామని వచ్చాను

● అరుణాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నబమ్ తుకీ

చండూరు : అసెంబ్లీ ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, ఆయన గెలిచిన తర్వాత మళ్లీ మీ అందరిని కలవడానికి మునుగోడుకు వస్తానని అరుణాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నబమ్ తుకీ అన్నారు. గురువారం చండూరు మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మీ రాజగోపాల్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికే కాదు..అరుణాచల్‌ప్రదేశ్‌కు కూడా నాయకుడేనని, రాజగోపాల్‌రెడ్డి విజయాన్ని చూద్దామని ఇక్కడికి వచ్చానని ఆయన అన్నారు. రాజగోపాల్‌రెడ్డి అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా, మయన్మార్, భూటాన్ మూడు దేశాల సరిహద్దుల్లో ఆర్మీ జవాన్ల రవాణా కోసం క్లిష్టమైన భౌగోళిక ప్రదేశంలో 250కిలోమీటర్ల రహదారిని నిర్మించారని.. నా ప్రియమిత్రుడు రాజగోపాల్‌రెడ్డి ఇంత దూరం నుంచి అరుణాచల్ ప్రదేశ్‌కు వచ్చి దేశ సైనికుల కోసం రహదారి నిర్మించడం గొప్పవిషయమన్నారు. రాజగోపాల్‌రెడ్డి రాష్ట్రానికే కాదు దేశానికి కూడా మునుముందు గొప్ప నాయకుడిగా ఎదగనున్నాడని అన్నారు. తప్పకుండా ఈసారి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి చేయడానికి అందరం కలిసి పనిచేస్తామన్నారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి పున్న కైలాస్‌నేత, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రాజగోపాల్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్న అరుణాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం నబమ్ తుకీ

విద్యుదాఘాతంతో రైతు మృతి



సైదులు (ఫైల్)

మునగాల(కోదాడ): మునగాల మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ఓ రైతు బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. గ్రామానికి చెందిన పట్ల సైదులు(50) వరి పైరు కోసి ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌కు ఏర్పాటు చేసిన కర్ర విద్యుత్ వైర్‌కు తగిలింది. తీగ ట్రాక్టర్ వెనుక నడుచుకుంటూ వస్తున్న సైదులుపై పడడంతో విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సైదులు మృతిచెందిన ప్రాంతం నడిగూడెం రెవెన్యూ పరిధిలో ఉండడంతో కుటుంబసభ్యులు నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



గాయపడిన శశిధర్

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని సాధువెల్లి గ్రామంలో గురువారం వీధికుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సుంకె హరీష్, సుగుణమ్మల కుమారుడు సుంకె శశిధర్ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాడు. పొలం పనుల నిమిత్తం తల్లిదండ్రులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిపోయారు. శశిధర్ సాయంత్రం తిరిగి ఇంటికి ఒంటరిగా వస్తున్న క్రమంలో వీధి కుక్కలు అతడిపై ఒక్కసారిగా దాడి చేశాయి. చెంప, కాళ్లతో పాటుగా, ఇతర భాగాలను తీవ్రంగా కరిచాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో, గాయాలపాలైన బాలుడిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. వారి సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

మిర్యాలగూడ అర్బన్: ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి నందిపాడు క్రాస్‌రోడ్డులో చోటు చేసుకుంది. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన నారబత్తుల సాయిమోహన్ చారి(23) ఐటీఐ పూర్తి చేశాడు. తండ్రికి చేదోడుగా ఉంటూ కార్పెంటర్ పని చేస్తున్నాడు. గురువారం మిర్యాలగూడలో పని ముగించుకుని రాత్రి తన ద్విచక్ర వాహనంపై నార్కట్‌పల్లి- అద్దంకి బైపాస్ రోడ్డు గుండా స్వగ్రామానికి వెళ్తున్నాడు. నందిపాడు క్రాస్‌రోడ్డు వైజంక్షన్‌లో వేగంగా వెనుక నుంచి వచ్చిన కంటైనర్ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో సాయిమోహన్‌చారి కింద పడిపోయాడు. అతడి తలపై నుంచి కంటైనర్ వెళ్లడంతో తీవ్ర రక్తస్రావం అయింది. స్థానికులు 108 సాయంతో ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంటైనర్ ఆపకుండా అక్కడి నుంచి వెళ్లిపోవడంతో పోలీసులు సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు. మృతుడి తండ్రి నాగాచారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

ఉరేసుకొని యువకుడు బలవన్మరణం



ఓర్సు ఎల్లం (ఫైల్)

తుర్కపల్లి: తుర్కపల్లి మండలంలోని చిన్నల క్ష్మాపూర్‌లో గురువారం ఓ యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన ఓర్సు యాదయ్య, నర్సమ్మలకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు ఓర్సు ఎల్లం (25), గ్రామంలో కూలీ పనులతో పాటు, రాయి కొడుతూ జీవనం సాగించేవాడు. ఇతనికి మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్, గంభిలాలపేటకు చెందిన రేఖతో 7 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కొన్ని రోజుల క్రితం జవహర్‌నగర్ పాలక సంస్థలో పని చేశాడు. మూడు రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. గురువారం ఉదయం 4 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లి బద్దూతండా వద్ద ఉన్న మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతూ తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కళాశాలకు వెళ్లడం ఇష్టం లేక..

వలిగొండ: వలిగొండకు చెందిన ఓ విద్యార్థి కళాశాలకు వెళ్లడం ఇష్టం లేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. దాసోజు వంశీ (20) హైదరాబాద్లో బీబీఏ చదువుతున్నాడు. దసరా సమయంలో ఇంటికి వచ్చాడు. కాలేజీకి వెళ్లమని తల్లిదండ్రులు అడగడంతో ఇష్టం లేదని చెప్పాడు. వారు అతడిని సముదాయించి గురువారం కాలేజీలో దింపిరావడానికి కారులో బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో వంశీ కారు దిగి బాత్‌రూం వెళ్లివస్తానని ఇంట్లోకి వెళ్లాడు. కొంత సమయం గడిచినా రాకపోవడంతో వెళ్లిచూసేసరికి పడక గదిలోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.